
కథ

# కుమార సంభవం

వసుధ ఎస్. గంగాల



ఉదయం పది గంటలకి ట్రెయిను. ఇల్లు శుభ్రం చేసుకుని స్నానం ముగించుకుని ఓ గ్లాసుడు బియ్యం అత్తెసరు పెట్టుకుని సంచిలో బట్టలు సర్దుకుంటుండగా తలుపు చప్పుడైతే వెళ్లి తెరిచాను. ఇంటాయన...శాస్త్రిగారు!

"ప్రయాణం హడావిడిలో ఉన్నట్టున్నారు...తిరిగివచ్చాక మాట్లాడుకుందాం" అన్నారు శాస్త్రిగారు లోపలికొస్తూ.

ఆయన చాలా ఉదాసీనంగా కనిపించారు. ఆయన్ని ఎన్నడూ అలా చూడలేదు నేను. ఆయనకి ముగ్గురబ్బాయిలూ, ఒక అమ్మాయి! తాతల నాటినుండి వస్తున్న వృత్తే...పౌరోహిత్యం. పెద్దబ్బాయి తిరుపతిలో మెడిసిన్ చదువుతున్నాడు. రెండవ అబ్బాయి మొన్ననే ఇంటర్ పాసయ్యాడు. మరో అబ్బాయీ, అమ్మాయీ స్కూలు చదువుల్లో ఉన్నారు.

"ఫర్వాలేదు, శాస్త్రిగారూ, బండికి ఇంకా వ్యవధి ఉంది. ఒక్క నిమిషంలో వచ్చేస్తాను కూచోండి. మాట్లాడుకుందాం" అని, వంటింట్లోకి నడిచాను.

'రాను రాను వైదిక కర్మలమీద నమ్మకం పోతోంది ప్రజలకి. సంవత్సరంలో సగం శూన్యమాసాలూ, అధికమాసాలూ తిష్ఠ వేసుకుని కూచుంటాయి. అందుకే పిల్లలకి వైదీకము కాదనుకుని ఇంగ్లీషు చదువులు చెప్పిస్తున్నాను. మా ఇంట వంశపారంపర్యంగా వస్తూన్న వేదం ఇక నా తర్వాత గంగార్పణమే!' అని చెప్పుకుని బాధ పడుతుంటారు శాస్త్రిగారు. ఒకవక్క పిల్లలకి మంచి భవిష్యత్తు కల్పించాలనే తహతహ; మరోవైపు సనాతన ఆచారాలకి నీళ్లొదిలేయవలసి వస్తోందనే బాధ ఆయన గొంతులో ప్రస్ఫుటమౌతూంటాయి ఆ మాట లంటున్నప్పుడు.

స్టౌమీద అన్నంగిన్నె దించి వచ్చేసరికి శాస్త్రిగారు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కనిపించారు.

"మా రెండోవాడికి మొన్న ఎంసెట్‌లో మంచి రేంకే వచ్చింది. అయితే, మనకి ఆ రేంకుకి కూడా ఫ్రీ సీటు రాదట. పేమెంట్ సీటులో చేర్పించే స్తోమత నాకు లేదు. ఇది గమనించి మా రెండవవాడు మరి చదవ నంటున్నాడు" అన్నారు శాస్త్రిగారు, దీర్ఘంగా నిట్టూర్చి.

ఆయన్నొకసారి నిశితంగా చూసి, "మరేం చేద్దామనుకుంటున్నాడు నారాయణ?" అన్నాను.

నారాయణ చాలా తెలివైనవాడు...ఎప్పుడూ మంచి మార్కులు తెచ్చుకుంటాడు.

"మంత్రపుష్పం, శ్రీసూక్తం, పురుషసూక్తం, పుణ్యాహవాచనం వచ్చు వాడికి. ఇక రుద్రం, నమకం, చమకం...నాలుగు వనసలూ నేర్చుకుని నా వ్యావకమే చేస్తూ నాకు చేదోడుగా ఉంటా నంటున్నాడు."

"ఇంత లేతవయసులోనా?! మరి నాతో ఇంజనీరింగ్ చదువుతానని చెప్పాడే ఆ రోజు?" అన్నాను సాలోచనగా.

"వాడికి చదవాలనే కోరిక బలంగా ఉంది. అయితే, ఇంటి పరిస్థితులు చూసి మనసు మార్చుకుంటున్నాడు. ఘనాపాఠీ, గండపెండేరాలూ మాట అటుంచండి. యాచకుణ్ని చూసినట్టు చూస్తున్నారు పురోహితుణ్ని. తెలివైనవాడూ, పైచదువులు చదివితే వృద్ధిలోకి రావలసినవాడూ...ఇలా అర్థాంతరంగా చదువు మానేయడం బాధగా ఉంది. వేదంపట్ల ఆదరణ పోయి పుక్కిటి పురాణాలు అంటూ ప్రతీవాడూ హేళన చేసేవాడే."

శాస్త్రిగారి గొంతులో ఆవేదన గ్రహించగలిగాను. "మీరు చెప్పింది నిజమే. అసలు ఏ ఒక్క పురాణాన్నయినా 'శ్రీ' నుంచి 'ఇతిశ్రీ' వరకూ చదివినవారెవరైనా ఉన్నారా ఈ రోజుల్లో? భూషణకైనా, దూషణకైనా వస్తుతత్వం తెలుసుకోవాలి" అన్నాను శాస్త్రిగారి మాటల్ని సమర్థిస్తూ.

"భౌతిక విలువలు సనాతన ధర్మాల్ని పాతర వేసేశాయి.

ఆదరణ లేని విద్యలెందుకు చెప్పండి? అందుకే మా నారాయణ నిర్ణయాన్ని ఆమోదించలేక పోతున్నాను. చివరి ప్రయత్నంగా వాళ్ల మేనత్త ఇంటికి పార్వతీపురం పంపించాను ఉత్తరం ఇచ్చి. ఆమెకి ఒక్కర్తే నలుసు. వీడిని చదివించి, అల్లుణ్ని చేసుకుంటుందేమో నని రాయడానికి మనసు చచ్చిపోయింది. వాడి బతుకు ఒక దారిలో పడుతుందని ఆశ! వీడొక్కడూ ఇల్లరికం వెళ్లినా, మిగతా పిల్లలున్నారు. ఈ విషయం వాడితో చెప్పలేదు...బాధ పడతాడని." ఉద్వేగంతో అన్నారు శాస్త్రిగారు.

"మీ ˇనుకున్నది జరగాలని ఆశిద్దాం" అన్నాను.

"మీకు బండి టైం అయినట్టుంది. కాస్త ఎంగిలిపడి బయలుదేరండి" అన్నారు శాస్త్రిగారు, కుర్చీలోంచి లేస్తూ.

***

ప్లాట్‌ఫారంమీద బండికోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. దుర్గ్‌నుంచి వచ్చిన పాసింజరులో నారాయణ దిగాడు.

"ఊరెళ్తున్నారా?!" అంటూ వచ్చాడు నన్ను చూసి.

"అవును, నారాయణా, అబ్బాయి దగ్గర కెళ్తున్నాను. రెండు రోజుల్లో వచ్చేస్తాను" అన్నాను బెంచీమీద వక్కకు జరిగి అతడు కూర్చోడానికి చోటిస్తూ.

ఆ అబ్బాయి కూర్చోలేదు. బలవంతం చేస్తే కూర్చున్నాడు.

"పార్వతీపురంనుంచా రావడం?" అన్నాను అతడి ముఖంలోకి చూస్తూ.

కాస్త ఇబ్బందిగా ముఖం పెట్టాడు. "మీకంతా నాన్నగారు చెప్పినట్టున్నారు. అత్తయ్య చదివించలేనంది." దిగులుగా ముఖం పెట్టి అన్నాడు.

"మరి ఏంచేద్దా మనుకుంటున్నావ్?" అన్నాను.

"ఇంట్లో పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది, మాస్టారూ! నాన్నగారి వ్యాపకమే చేపట్టి ట్యూషన్లుకూడా చెప్తాను. మన వీధిలోనే 'ప్రాతూరి'వారి ఇల్లంతా ఖాళీగా ఉంది. ముందుగది ఉచితంగా ఇస్తామన్నారు ట్యూషన్లు చెప్పుకోడానికి. ఇప్పటికి ఒక పదిమంది పదో తరగతి పిల్లల్ని కుదుర్చుకున్నాను" అన్నాడు నారాయణ తా నొక దృఢనిశ్చయాని కొచ్చినట్లు.

నేనేమీ అనలేకపోయాను. ఆ పసిమనసుకి మనసులోనే జోహార్లర్పించాను.

ఇంతలోనే మెయిలు వచ్చి ఆగడంతో ఇద్దరం లేచి నా కంపార్టుమెంటువైపు నడిచాం. ట్రెయిను కదిలేదాకా ఉన్నాడు నారాయణ.

***

కొడుకు నిర్లక్ష్యవైఖరీ, కోడలి ఈసడింపులూ, పిల్లల అనాసక్తీ...ఏలూరులో ఉన్న రెండు రోజులూ రెండు యుగాల్లా గడిచాయి.

తల్లి తద్దినం ఆ నెలలోనే పడుతోందని గుర్తు చేద్దామని మావాడి గదివైపు నడిచాను రెండోరోజు రాత్రి. ఆ మర్నాడే నా తిరుగు ప్రయాణం. కొడుకూ, కోడలూ నా గురించే మాట్లాడుకోవడం విని ద్వారం బయటనే నిలబడిపోయాను.

'ఈయన ఇక్కడ ఉండిపోదామనే మిషతో


**Attn : Teachers/Lecturers/Educated Housewives/ Professionals/Employees/Self Employed Persons**

# DO YOU HAVE

**Good Communication Skills, Knowledge of English and Telugu, Spare time, Spiritual Inclination, Value for Service and want to supplement your earnings ?** if yes, then read on...



Prasanna Trust is an organization engaged in serving humanity through activities like transformative education, social service etc., The trust has chapters at Bangalore, Chennai, Hyderabad, Bombay, Baroda and Delhi. The Founder Chairman of Prasanna Trust is Swami Sukhabodhananda, the Famous International Spiritual and Management Master. Prasanna Trust offers two self-development programs named as **Mantra Yoga** and **Personal Effectiveness Program (PEP).** Both these programs are being conducted in several cities very successfully by senior students of Swamiji. The programs are available in English, Hindi, Telugu and other regional languages.

Prasanna Trust plans to appoint Franchisee teachers at all district head - quarters & other important towns to conduct these programs in their own towns in spare time. Good regular income, extreme satisfaction and personal growth are the rewards. Necessary training will be provided by Swamiji to adequately equip the prospective teachers in all respects from 1st to 10th June at Hyderabad. The fee for the Training Program is Rs. 7000/- per participant (Incl. of Food & Stay). All the teaching aids and continuous support shall be made available after successful completion of the training program.

Interested persons may apply with a passport size photo and personal resume within 10 days to :

ROOTS OF RESPONSIBILITY
WINGS OF FREEDOM

**Prasanna Trust**
**702E, Al-karim Trade Centre, Ranigunj, Secunderabad - 3. Tel : 55260041/42/43/44.**
**Email : mantrayoga@rediffmail.com**

**Space courtesy : GMR Group of Companies**

నెలనెలా డబ్బు తీసుకుని వస్తున్నట్టున్నారు. నేను మాత్రం ఈయనకి ఊడిగం చెయ్యలేను' అంటోంది కోడలు.

'ఎలాగూ రేపు ఉదయం వెళ్లిపోతున్నారుగా. నాల్రోజులు పోయాక ఒక ఉత్తరం రాసి పడేస్తాను...'డబ్బు ఇవ్వడం కోసం ఇంతదూరం శ్రమపడి రావడమెందుకు? డ్రాఫ్టుద్వారా పంపించండి. క్షేమసమాచారంతో ఉత్తరం రాస్తూంటాను' అని.' మా వాడి మాటలు శూలాల్లా తగిలాయ్ మనసుకి. ఇతడా తనని వైతరణి దాటించేది?! అనుకున్నాను వెనుదిరిగి నా గది చేరుకుని.

***

తెల్లవారగానే తిరుగు ప్రయాణమయ్యాను. నే నెక్కవలసిన బండి ప్లాట్‌ఫారాన్ని కుదిపేస్తూ వచ్చి ఆగింది. అంతవరకూ స్తబ్ధుగా ఉన్నా ప్లాట్‌ఫారం కెలకబడిన తేనెపట్టులా తయారైంది. నాతోపాటు పక్క బెంచీమీద కూర్చున్న పెద్దాయనకూడా లేచాడు. ఒక యువజంట ఇద్దరు పిల్లలతో అతనికి వీడ్కోలు చెప్పడానికి వచ్చారు. చిన్నపిల్లలిద్దరూ అతడి చేతులు పట్టుకుని మారాం చేస్తున్నారు అతడిని వెళ్లవద్దంటూ.

క్షణకాలం ఆ దృశ్యం తన్మయత్వంతో చూసి నా బోగీవైపు నడిచాను. ఆయనకూడా నా బోగీయే ఎక్కాడు. నా సీటు ఎదురుగా కూర్చున్నాడు.

"మరో వారం రోజులుండుంటే బాగుండేది, మామయ్యగారూ!" అంటోంది కోడలు కిటికీపక్క నిలబడి.

"అక్కడ చాలా పని ఉన్నాయమ్మా...పిల్లలకి సెలవలివ్వగానే వచ్చేయండి. నీ ఆరోగ్యం జాగ్రత్త" అంటున్నాడు పెద్దాయన.

ట్రెయిను కదిలింది. కన్నీటితో వీడ్కోలు చెప్పారు పిల్లలిద్దరూ.

"చేరగానే ఫోన్ చెయ్యండి." ఆప్యాయంగా అన్నాడు కొడుకు.

"పిల్లలు జాగ్రత్త." కదులుతున్న ట్రెయినులోంచి కొడుకుకి వినబడేలా చెప్పాడు ఆయన.

అతడినే చూస్తూ కూర్చున్నాను కాస్త అసూయతో. నిశ్చలంగా కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. అదృష్టం అంటే అతనిది! ఎంతగానో అభిమానించే ఆత్మీయులున్నారతనికి. నేనూ ఉన్నాను. నా ఉనికి ఎవ్వరికీ అవసరం లేదు. భార్య చనిపోయి నాలుగేళ్లైంది. ఉన్న ఒక్క కొడుకుకి తను అవసరం లేదు. తను నెలనెలా పెన్షన్ అందుకుని ఇచ్చే సగం పెన్షనూ అతడికి అవసరం లేదు. మమకారం చంపుకోలేక నెలకి కనీసం రెండు రోజులైనా కొడుకు అనురాగాన్ని రెండువేల రూపాయలతో కొనాలని నెలనెలా ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. ధర అయితే చెల్లిస్తున్నాడు కాని, ఆ అనురాగమనేది ఆవడ దూరంలోనే ఉండిపోతోంది. ఎందుకూ కొరగాని ఒంటరి బతుకు తనది. ఎన్నాళ్లు జీవించాలో ఇలా? ఇలా జీవిస్తూ సాధించే దేముంది కనుక?

"మీ రెంతవరకూ వెళ్తున్నారు?" పేపరు మడిచి నావైపు చూస్తూ ఆయనన్నమాటలకి వాస్తవంలోకి వచ్చాను.

"వి...జ...య....నగరం" అన్నాను కాస్త తొట్రుపడుతూ.

"నేను అనకాపల్లి వరకూ." అతనే అన్నాడు మళ్లీ.

"మీ అబ్బాయి, పిల్లలూ చాలా బాధ పడుతూ వీడ్కోలు చెప్పారు. అంతగా అభిమానించే పిల్లలుండడం మీ అదృష్టం." అప్రయత్నంగా అనేశాను.

"నిజమే... అయితే, మీకింకో విషయం చెప్పాలి. ఆ అబ్బాయి నా కన్నకొడుకు కాదు. నా కొడుకు అమెరికాలో స్థిరపడి పోయాడు, అక్కడి పిల్లనే చేసుకుని. వాళ్లమ్మ చనిపోయి చాలాకాలమైంది. ఇక్కడ పనులు వదులుకుని నేను అమెరికా వెళ్లలేను. వాడు వచ్చి నా దగ్గర ఉండలేడు. అలా కొన్నాళ్లు భరించాను ఒంటరితనం. తర్వాత ఏ ఆధారమూ లేని ఈ అబ్బాయిని చేరదీసి చదివించాను. మంచి ఉద్యోగం వచ్చింది. పెళ్లి చేసి ఒక ఇంటివాడిని చేశాను. కన్నతండ్రికంటే మిన్నగా చూసుకుంటున్నాడు నన్ను. కోడల్నీ, పిల్లల్నీ అనకాపల్లి బదలీకోసం ప్రయత్నం చేస్తున్నాడు. అప్పుడు అందరం కలసి ఒకచోటనే ఉండవచ్చు. ఇన్నాళ్లూ... కొన్నాళ్లు వాళ్లూ, కొన్నాళ్లు నేనూ వస్తూ పోతూ వచ్చాం..." అంటున్న ఆయనవైపు అవాక్కై చూస్తూ ఉండిపోయాను.

ఆయన మాటలు నా జీవితానికీ ఒక పరమార్థం చేకూర్చుకోవచ్చునని సూచించాయి. అభయహస్తంతో కూర్చున్న శ్రీమన్నారాయణుడిలా కనిపించాడు ఆయన.

ఇంజనీరింగ్‌లో చేరడానికి తహతహలాడుతూ నిస్సహాయంగా నిలబడిన నారాయణ కళ్లలో మెదిలాడు. ఈ అబ్బాయి ఇతడిని చూసుకున్నట్టు నారాయణ తనని చూసుకున్నా, చూసుకోకపోయినా ఫర్వాలేదు. నారాయణ కో మంచి భవిష్యత్తు చేకూర్చాలి. అదే తన జీవితానికి పరమార్థం.

ఆహ్లాదం కలిగిస్తూ కిటికీలోంచి చల్లనిగాలి ముఖాన్ని తాకింది. హాయిగా కళ్లు మూసుకున్నాను తేలికైన మనసుతో. 'కూరిమి గలవారంతా కొడుకులేనురా...' ఎప్పుడో విన్న ఘంటసాల పాట గుర్తొచ్చింది. ■

## గడి-నుడి 13వ పేజీ తరువాయి

కె. గాయత్రీ మణి (మచిలీపట్నం), రాజామణి గంగాధరరావు, పింగళి కనకవల్లి, ఎమ్. తిరుపాలమ్మ, నిశ్శంకరరావు ప్రసాదరావు (గుంటూరు), కోపూరి వేంకట సుబ్బయ్య, భాగవతుల అనూరాధ (ఒంగోలు), నిజకవి శ్రీనివాసాచార్యులు (ఎల్లిగొండపాలెం), టి.ఆర్. బాలకృష్ణారావు (రాజమండ్రి), కుంటుముక్కల శ్రీనివాసరావు, డా॥ పాలంకి సవితా దత్తాత్రేయ, కేమిశెట్టి భువనేశ్వరి (కాకినాడ), ఆకొండి శారదాదేవి (అమలాపురం), కూచి ప్రభావతి, కొండెపూడి రమణి ముంగండ), గెడ్డం సూరయ్య, జి. రాజేశ్వరరావు (కిర్లంపూడి), వారణాసి శ్రియా కమలాకర్, తాండ్యాల రామచందర్, బిందు మాధవి (ఆదిలాబాద్), తుమరాడ నరశింహారావు, ఎ. పూర్ణచంద్రరావు, కె.లీల (విశాఖపట్నం), ఇజ్జపురెడ్డి జగదాంబ, ఆకుండి చిన కామేశ్వరరావు (విజయనగరం), జి. జయచంద్రగుప్త, భాస్కరపంతుల కృష్ణమూర్తి శర్మ, డా॥ కె.జి. జయరామిరెడ్డి (కర్నూలు), శ్రీనివాసరావు సొంసాళె (ఎమ్మిగనూరు), ఆర్. అనసూయ రాజు (ఆదోని), వై. శ్రీనివాసులు, అప్పాజీ శివశంకరరావు, డి. వేణుగోపాల్, ఎ.టి. శ్రీనివాసన్, కె. శమంతకమణి (అనంతపురం), మాద్దుల శశికళా మోహన్ (గోరంట్ల), పెండ్యాల సీత (గుంతకల్లు), వి.ఆర్. మాలతి (పలమనేరు), యన్. పట్టాభిరామ పిళ్లై, పి. శ్రీనివాసులు (కుప్పం).